సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



రూ.లక్ష సమర్పణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు నండూరి వెంకట గంగారాజశేఖర్ (చినకొండేపూడి) ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు.



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి వాస్తవ్యులు శనివారం రూ.25,116 విరాళంగా అందించారు.

వక్రతుండాయ.. బహురూపాయ



వక్రతుండ మహాకాయ.. కోటి సూర్య సమప్రభ.. నిర్విఘ్నం కురుమేదేవ.. సర్వకార్యేషు సర్వదా.. అంటూ బొజ్జ గణపయ్యను అంతా కొలిచారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. - 8లో ▸

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని అన్నారు.

ట్రాన్స్‌కోపై టీడీపీ నేత ఒత్తిడి

నిబంధనలకు విరుద్ధంగా ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలని పట్టు

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి సమీపంలో ఓ టీడీపీ నాయకుడు అపార్ట్‌మెంట్ నిర్మించారు. దీనికి నిబంధనలకు విరుద్ధంగా అదీ ఉచితంగా తనకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నాడు. అదే పార్టీ ఓ కీలక ప్రజాప్రతినిధికి అనుచరుడిగా... ఆయన పేరుతో, అండతో అధికారులకు హుకుం జారీ చేస్తున్నాడు. ఆ నాయకుడొక అపార్ట్‌మెంట్‌ను కొత్తగా నిర్మించాడు. సాధారణంగా ఓ మిల్లు లేదా ఏదైనా మినీ పరిశ్రమ, అపార్ట్‌మెంట్లు, పెద్ద గ్రూపు హౌస్‌లు నిర్మించుకుంటే రెండు, అంతకు మించి విద్యుత్ కనెక్షన్లు అవసరమైతే అక్కడ వాటి యజమానే సొంత ఖర్చుతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించుకోవాలనేది నిబంధన. ఈ నాయకుడు తాను నిర్మించిన అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లు, పెంట్ హౌస్‌తో కలిపి మొత్తం 8 విద్యుత్ కనెక్షన్లు పొందాల్సి ఉంది. అపార్ట్‌మెంట్ వద్ద 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ సొంతంగా ఏర్పాటు చేసుకోవాలి. ఇందుకు రూ.5 లక్షల వరకూ ఖర్చవుతుంది. అయితే అధికార పార్టీ గర్వం, ఓ కీలక ప్రజాప్రతినిధి అండతో ఆ నాయకుడు ట్రాన్స్‌కో అధికారులపై వారం రోజులుగా తీవ్ర ఒత్తిడి తెస్తున్నాడు. నిబంధనలు ఒప్పుకోవవి అధికారులు చెబుతున్నా, ససేమిరా అంటున్నారు. పైగా మీ సంగతేంటో తేల్చుతానని హెచ్చరికలు చేసి అధికారులను బెదిరిస్తున్నాడు. స్థానికంగా ఈ అంశం చర్చనీయాంశమైంది.

కోనసీమ డీసీసీ అధ్యక్షునిగా కొండేటి

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నగరం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును నియమించారు. దీనికి సంబంధించి ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు.

సొంతూరిలో 'ఆయ్' చిత్ర దర్శకుడు



కోనసీమ జేఏసీ ప్రతినిధులతో మాట్లాడుతున్న దర్శకుడు అంజిబాబు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన ఆయ్ చిత్ర దర్శకుడు కంచిపల్లి అంజిబాబు వినాయక చవితికి స్థానిక కొంకాపల్లిలోని తన స్వగృహానికి వచ్చారు. దీంతో ఆయన్ని పలు సంఘాల ప్రతినిధులు కలసి అభినందించారు. కోనసీమ యాసతో ఈ ప్రాంత కథాంశంతో అశ్లీలతకు తావు లేకుండా వినోదాత్మకంగా తీసిన ఆయ్ చిత్రం విజయవంతంపై దర్శకుడు అంజిబాబుతో ముచ్చటించారు. కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు ఆధ్వర్యంలో మిత్ర బృందం కలసి అంజిబాబును అభినందించింది. కోనసీమ ప్రజలు ఈ చిత్రాన్ని బాగా ఓన్ చేసుకున్నారని అంజిబాబు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. తన రెండో చిత్రం కూడా గీతా ఆర్ట్స్ బ్యానర్‌పైనే ఉండవచ్చని స్పష్టం చేశారు. కోనసీమ జేఏసీ ప్రతినిధులు రంకిరెడ్డి శ్రీనివాస్, నంద్యాల నాయుడు, ముత్యాల శరత్ బాబు, కరాటం ప్రవీణ్ తదితరులు అంజిబాబును సత్కరించారు.

వచ్చే ఏడాదికి నూతన టెర్మినల్ భవనం పూర్తి

మధురపూడి: రాజమహేంద్రవరం విమానాశ్రయం విస్తరణకు చర్యలు తీసుకుంటామని, ఢిల్లీ, తిరుపతి, షిర్డీలకు విమాన సర్వీసులు నిర్వహిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆదివారం మధురపూడిలోని విమానాశ్రయంలో జరుగుతున్న పనుల పురోగతి, విస్తరణపై ఆయన సమీక్షించారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వర రావు రూ.173.28 కోట్ల ప్రతిపాదనలతో గతేడాది ఆగస్టు 13న పనులు ప్రారంభించినట్టు తెలిపారు. జరుగుతున్న నూతన టెర్మినల్ భవనం వచ్చే సంవత్సరం ఆగష్టు 11 వతేదీ నాటికి పూర్తిచేయాల్సిన లక్ష్యంతో పనులు జరుగుతున్నట్టు తెలిపారు. అలాగే విమానాశ్రయ విస్తరణకు భూములిచ్చిన రైతుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

కుర్చీలపై కర్చీఫ్

- వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో జనసేనకు ఝలక్
- అధిక చోట్ల అవకాశం కోసం టీడీపీ పట్టు
- పదవులపై టీడీపీ, జనసేనల మధ్య చిచ్చు



కొత్తపేట (రావులపాలెం) మార్కెట్ యార్డు

సాక్షి, అమలాపురం: కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల పంపకాలు భాగస్వామ్య పార్టీల మధ్య చిచ్చు రేపుతోంది. ఇందులో ప్రధానంగా టీడీపీ వారే ఎక్కువ పదవులపై కన్నేయడం వివాదానికి కారణమవుతోంది. ఎమ్మెల్యేతో సమానంగా నియోజకవర్గంలో ప్రోటోకాల్ ఉండే పదవిగా గుర్తింపు పొందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్లకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. వీటి కోసం టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నాయకులు పోటీ పడుతున్నారు. కొత్త ఆశావహులు పుట్టుకొస్తున్నారు. జిల్లాలో ఈ రెండు పార్టీల మధ్య పోటీ రసవత్తరంగా సాగుతోంది. జనసేనకు సీటు త్యాగం చేశామని, వారు ఎమ్మెల్యేలు ఉన్నచోట తమకు అవకాశం ఇవ్వాలని టీడీపీ నాయకులు పట్టుబడుతున్నారు. ఇదే సమయంలో టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నచోట జనసేనకు అవకాశం ఇచ్చేది లేదని టీడీపీ తేల్చి చెబుతుండడం చిచ్చు రేపుతోంది.

జిల్లాలో తొమ్మిది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గానికి మాత్రం రెండు చొప్పున, మిగిలిన నియోజకవర్గాల్లో ఒకటి చొప్పున ఏఎంసీలు ఉన్నాయి. ఇందులో అంబాజీపేట, నగరం, కొత్తపేట, ఆలమూరు, ముమ్మిడివరం, రాజోలు, రామచంద్రపురం మార్కెట్ కమిటీలు ఆదాయ పరంగానే కాకుండా గొడౌన్లు, ఇతర సదుపాయాలు ఉన్నాయి. జనసేన ఎమ్మెల్యేలున్న పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని ఏఎంసీ పదవులు తమ పార్టీకి కేటాయించాలని టీడీపీ నాయకులు పట్టుబడుతున్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవికి జనసేనతోపాటు టీడీపీ నుంచి గట్టి పోటీ ఉంది. జనసేనలో ఆ పార్టీ నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి గోపీ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. టీడీపీ తరపున నాయకుడు అయినవిల్లికి చెందిన సయ్యపురాజు సత్తిబాబు రాజు రేసులో ముందున్నారు. టీడీపీకి అంటూ ఇస్తే పార్టీ అధిష్టానం, జిల్లాలో పార్టీ పెద్దల మద్దతు ఉన్న ఇతనికే పదవి దక్కే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. ఇదే నియోజకవర్గం పరిధిలో నగరం ఏఎంసీని కూడా టీడీపీ ఆశిస్తుండడంతోపాటు ఆ పార్టీకి చెందిన సూధా వెంకట స్వామినాయుడు (బాబ్జీ) అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ జనసేన క్యాడర్‌కు ఏఎంసీ చైర్మన్ పదవి ఇచ్చేంత సీన్ లేదని టీడీపీ నాయకులు బహిరంగంగా ప్రచారం చేస్తుండడం గమనార్హం.



అంబాజీపేట మార్కెట్ యార్డు

ఆ పార్టీల మధ్య పోరు..

అమలాపురం మార్కెట్ కమిటీ సైతం జనసేన, టీడీపీల మధ్య పోరు ఉంది. జనసేన పార్టీ నుంచి లింగోలు పండు, చింతపల్లి చిన్నాలు పదవి కోసం పట్టుబడుతున్నారు. వీరిద్దరూ ఇటీవల పార్టీ కార్యక్రమాల్లో బల ప్రదర్శనకు సైతం దిగుతున్నారు. కానీ ఈ పదవి తమ పార్టీ వారికి ఇవ్వాలని టీడీపీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుపై క్యాడర్ ఒత్తిడి తెస్తున్నారు. ఆనందరావు సైతం సొంత పార్టీ నేతలకే మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. ఆ పార్టీ నుంచి సీనియర్ నేతలు నల్లా స్వామి, అల్లాడి సోంబాబుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

- మండపేట ఏఎంసీ పదవి తమ పార్టీకి ఇవ్వాలని కోరుతున్నా జనసేన నుంచి చెప్పుకొనే స్థాయి నాయకత్వం లేదు. పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న వేగుళ్ల లీలాకృష్ణ రాష్ట్ర స్థాయి పదవి ఆశిస్తుండడంతో ఏఎంసీ కావాలని పట్టుబట్టే అవకాశం లేదు. టీడీపీ నుంచి సైతం పెద్దగా హడావుడి లేదు. కొత్తపేట నియోజకవర్గం పరిధిలో కొత్తపేట, ఆలమూరు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. కొత్తపేటను టీడీపీకి, ఆలమూరు జనసేనకు ఇవ్వాలని రెండు పార్టీలు అవగాహనకు వచ్చినట్టు తెలిసింది. రామచంద్రపురం ఏఎంసీ చైర్మన్ పదవికి సైతం రెండు పార్టీలు పట్టుబడుతున్నాయి. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాత్రం టీడీపీకి మొగ్గు చూపుతున్నారు. ముమ్మిడివరం ఏఎంసీని సైతం టీడీపీకి కట్టబెట్టేందుకు అక్కడి ఎమ్మెల్యే ఒక అంచనాకు వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. మొత్తం మీద కోనసీమ జిల్లాలో జనసేనకు ఇచ్చే మార్కెట్ కమిటీలు రెండుకు మించి ఉండే అవకాశం కనిపించడం లేదు. ఈ పరిణామాలు చూసి ఆ పార్టీ క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. దీనిపై ఆ పార్టీ కీలక నాయకులు గత నెలలో జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్థానికంగా జరుగుతున్న కార్యక్రమాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు తమకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదని, మొర పెట్టుకుంటూనే.. మార్కెట్ కమిటీ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని వారు వేడుకుంటున్నారు.

ఇదే ఆనవాయితీగా..

రాజోలు ఏఎంసీ చైర్మన్ పదవి బీసీలలో **శెట్టిబలిజలకు** కేటాయించడం ఆన**వాయితీగా** వస్తోంది. ఇది కూడా తమకే **వస్తోందని** టీడీపీ నాయకులు నమ్మకం**తో ఉన్నారు.** ఆ పార్టీ నుంచి కాండ్రేగుల **భవానీ లావణ్య** పేరు ప్రముఖంగా పైకి **వచ్చింది. ఈమె**తోపాటు గుబ్బల శ్రీని**వాస్, కాకి లక్ష్మణ్** పేర్లు వినిపిస్తున్నారు. **గత ఎన్నికల్లో** సీటు వదులుకున్నందున **తమకే** అవకాశం దక్కాలని టీడీపీ నేతలు పట్టుబడుతున్నారు. జనసేన ఎమ్మెల్యే ఉన్న ఈ రెండు నియోజకవర్గాల పరిధిలోని మూడు మార్కెట్ కమిటీ చైర్మన్ల పదవులను టీడీపీ స్థానిక నేతలు ఆశిస్తుండడంతోపాటు ఆ పార్టీ అధిష్టానం వద్ద కూడా పట్టుబడుతుండడం గమనార్హం. ఇక మిగిలిన ఐదు నియోజకవర్గాలలో ఉన్న మార్కెట్ కమిటీలలో మాత్రం టీడీపీ ఎమ్మెల్యేలు తమ సొంత వారికే ఇచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

నిండుకుండలా 'ఏలేరు'

- దిగువకు 7500 క్యూసెక్కుల విడుదల
- 21.38 టీఎంసీల నీటినిల్వలు



ఏలేరు గేట్ల నుంచి విడుదల చేస్తున్న నీరు

ఏలేశ్వరం: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలేరు జలశయం నిండుకుండలా ఉంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో నీటినిల్వలు పెరుగుతున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా దిగువ ప్రాంతానికి 7500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సామర్థ్యం వరకు పెరిగితే నీటిని వదిలేందుకు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ప్రస్తుతం ఎగువప్రాంతం నుంచి 15.255 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టులోకి చేరుతున్నది. దీంతో ఆదివారం నాటికి ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 85.20 మీటర్లు, 24.11 టీఎంసీలకు 21.38 టీఎంసీలకు నీటినిల్వలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు మాత్రమే 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రజా సేవలో మరిన్ని ఆర్టీసీ సర్వీసులు

రాజమహేంద్రవరం సిటీ: రాబోయే రోజుల్లో ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు రాష్ట్రంలో 1400 సర్వీసులను ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర క్రీడలు, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి 22 నూతన సర్వీసులను ప్రారంభించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలతో పాటు, వారి ఆరోగ్యంపైనా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో నాణ్యతతో కూడిన సేవలు అందించే దిశగా ఎలక్ట్రికల్ బస్సు సర్వీసులను ప్రారంభించనున్నామని తెలిపారు. రాష్ట్రంలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ సర్వీసులను ప్రారంభించే దిశగా పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. కలెక్టర్ పి. ప్రశాంతి, అధికారులు పాల్గొన్నారు.


స్వామిని చూసి.. మది మురిసి

అయినవిల్లికి పోటెత్తిన భక్తజనం



భక్తులతో కిక్కిరిసిన అయినవిల్లి విఘ్నేశ్వరాలయం

అయినవిల్లి: వినాయకా భజేహం అంటూ ఆ స్వామి వారిని భక్తజనం కొలిచి తరించింది.. ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శని, ఆదివారాల్లో కిక్కిరిసింది. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అందరికీ ఉచిత దర్శనాలు కల్పించడంతో క్యూ లైన్లు నిండిపోయాయి. తెల్లవారు జామున 4 గంటల నుంచి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత పంచామృతాభిషేకాలు, లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం, లక్ష గరిక పూజ, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అలాగే స్వామి వారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం స్వామికి పంచ హారతులు ఇచ్చారు. రాత్రి ఏర్పాటైన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయం వద్ద విద్యుత్ దీపాల అలంకరణ ఆకట్టుకుంది. పుష్పాలంకరణతో ఆలయ ప్రాంగణం కనువిందు చేసింది. స్వామివారిని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మంత్రి వాసంశెట్టి సుభాష్ తదితరులు దర్శించుకున్నారు. చవితి మహోత్సవాల సందర్భంగా ఆలయానికి శని, ఆదివారాల్లో రూ.7,64,312 ఆదాయం సమకూరిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. సుమారు 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామివారి అన్న ప్రసాదాన్ని 16 వేల మంది స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో వినాయక స్వామి

వరద తగ్గింది.. వర్షం పెరిగింది

- ముంపు నుంచి బయట పడుతున్న లంకలు
- తెల్లవారు జాము నుంచి ఆగని వాన



అమలాపురంలో కురుస్తున్న వర్షం

సాక్షి, అమలాపురం: ఒకవైపు పోటెత్తిన గోదావరి శాంతిస్తుండగా.. మరోవైపు జిల్లాలో వర్షం పడుతూనే ఉంది. వరద తగ్గడంతో లంక గ్రామాల్లో కాజ్‌వేలు, ప్రధాన రోడ్లు ముంపు నుంచి బయట పడగా.. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. జిల్లాలో గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద తగ్గుతూ వస్తోంది. ఉదయం ఏడు గంటలకు 6,56,642 క్యూసెక్కులుగా ఉన్న వరద ప్రవాహం, రాత్రి తొమ్మిది గంటల సమయంలో 4,64,844 క్యూసెక్కులుగా ఉంది. దీంతో దిగువన కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల్లో వరద వీడుతోంది. అయినవిల్లి మండలం ముక్తేశ్వరం ఎదురుబిడియం కాజ్‌వేపై వరద నీరు తగ్గింది. దీనితో అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక గ్రామాలకు వాహనదారుల రాకపోకలకు మార్గం ఏర్పడింది. వృద్ధ గౌతమీ నదీపాయలో మాత్రం వరద ఉధృతి కొనసాగుతోంది. మామిడికుదురు మండలంలో వైనతేయ నదీపాయలో వరద తగ్గడంతో అప్పనపల్లి కాజ్‌వేపై నీరు వీడింది. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పాశర్లపూడికి నేరుగా రాకపోకలు సాగిస్తున్నారు. అల్లవరం మండలం బోడసకుర్రు పల్లెపాలెంలోకి శుక్రవారం చొచ్చుకువచ్చిన వరద ఇప్పుడు తగ్గింది. ఇక్కడి మత్స్యకారుల ఇళ్లు ముంపు నుంచి బయటపడ్డాయి. కానీ వరద తెచ్చిన బురద రోడ్లపైకి చేరడంతో స్థానికులు నడిచి వెళ్లేందుకు సైతం ఇబ్బంది పడుతున్నారు. పి.గన్నవరం మండలంలో వరద వల్ల గంటి పెదపూడిలంక, ఊడిమూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు, పశ్చిమ గోదావరి జిల్లా పరిధి కనకాయిలంక, అయోధ్యలంక, అనగారిలంక, శిర్రావారిలంక గ్రామాలకు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివారు శివాయిలంకను వరద వీడింది. ముమ్మిడివరం మండలం గురజాపులంకకు వెళ్లే సిమెంట్ రోడ్డు వరద ముంపు నుంచి బయటపడింది.

వర్షపాతం ఇలా...

వాయుగుండం ప్రభావంతో ఆదివారం తెల్లవారు జాము నుంచి ఒక మోస్తరు వర్షం కురుస్తోంది. జిల్లాలో సగటున 7.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అధికంగా కొత్తపేటలో 15.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా అమలాపురంలో 2.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో సామాన్యులు ఇబ్బంది పడ్డారు. ఆలమూరులో 13.4, రావులపాలెంలో 13.2, మండపేట, రాయవరం 12, కపిలేశ్వరపురం 11.2, కె.గంగవరం 8.8, ఆత్రేయపురం 8.4, ముమ్మిడివరం 8.2, అయినవిల్లి 7, రాజోలు 6.2, రామచంద్రపురం 6, ఐ.పోలవరం 4.6, కాట్రేనికోన, మామిడికుదురు 4.2, అల్లవరం, పి.గన్నవరం 3.8, సఖినేటిపల్లి 3.4, ఉప్పలగుప్తం, అంబాజీపేట 3.2, మలికిపురం 3 మిల్లీమీటర్ల చొప్పున వర్షం పడింది.

భవిష్యత్ కథ కల్కి

సమన్వయ సరస్వతి సామవేదం



సామవేదం షణ్ముఖశర్మ

రాజమహేంద్రవరం రూరల్: కలిని అంతమొందించే కల్కి ఇంకా అవతరించలేదు. కల్కి కథ భవిష్యత్ కథ అని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. కొంతమూరులోని శ్రీవల్లభగణపతి మందిర ప్రాంగణంలోని ప్రవచన మందిరంలో ఆయన ఆదివారం కల్కి అవతార వైభవంపై ప్రసంగం కొనసాగించారు. కలి పురుషుడి విజృంభణ ప్రధానంగా కలియుగంలోనే కనపడుతుంది. అయితే, మిగతా యుగాల్లో కూడా కలి ప్రస్తావన ఉన్నదని సామవేదం అన్నారు. క్షీర సాగర మథన సమయంలో విష్ణువు అసురులలో పరస్పర కలహాలు కలగచేయడానికి కలి పురుషుడిని ఆహ్వానిస్తాడు. ఈ విద్యలో కలి సిద్ధహస్తుడు. కలి రాక్షస బుద్ధులను ఆవహించాడు. అలాగే నలదమయంతుల కథలో కూడా కలి ప్రస్తావన ఉంది. ధర్మవర్తనుడైన నల చక్రవర్తిలో ప్రవేశించడానికి కలి 12 ఏళ్లు ఎదురుచూశాడు. పాదప్రక్షాళన చేసుకోకుండా సంధ్యను ఉపాసించడానికి పూనుకున్న నలునిలో కలి ప్రవేశించగలిగాడని సామవేదం అన్నారు. కలి దోష నివారణకు చెప్పిన ఉపాయాలలో నలదమయంతుల స్మరణ ఒకటి. వ్యాసభగవానుని మహర్షులు ఒక మంచి మాట చెప్పమంటే, ఆయన కలిస్సాధుఃకలి మంచిదని అన్నాడు. మిగతా యుగాల్లో అత్యంత కఠినతరమైన తపోనియమాలు పాటిస్తే కానీ లభ్యం కాని ముక్తి, కలియుగంలో నామస్మరణ మాత్రంచే లభిస్తుందని, కృతయుగంలో ఏడాది పాటు చేసే సాధన కలిలో ఒక్క రోజు సాధనతో సమానమని అన్నారు. కలౌనామస్మరణాన్ముక్తిః అన్నారు. పుణ్య కర్మలను, పుణ్య విధులను తలుచుకున్నా కలిలో ఫలితం లభిస్తుంది. కానీ మిగతా యుగాల్లో పుణ్యకర్మలు చేస్తేనే ఫలితం ఉంటుందని సామవేదం అన్నారు. ఈ యుగంలో కలి జూదం, మద్యం, స్త్రీ, సువర్ణాలను ఆశ్రయించుకుని ఉంటాడని, ఇక్కడ స్త్రీ అంటే స్త్రీ వ్యసనం, అంతేకాని స్త్రీలను చిన్న చూపు చూడటం కాదని, సనాతన ధర్మం స్త్రీకి గౌరవం ఇచ్చిందన్నారు. అలాగే సువర్ణమంటే ధనలోభమని, మనం కలియుగం ప్రథమ పాదంలో ఉన్నాం, ఒకో పాదం గడిచే కొద్దీ, కలి విజృంభణ మరింత పెరుగుతూ ఉంటుందని సామవేదం అన్నారు. ముందుగా భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు స్వాగత వచనాలు పలికారు.

హడలెత్తిస్తున్న చిరుత

- పుకార్ల వ్యాప్తితో మరింత ఆందోళన
- తీవ్రంగా గాలిస్తున్న అటవీ సిబ్బంది



విలేకరులకు పులి కాలిముద్రలు చూపుతున్న డీఎఫ్‌ఓ భరణి

రాజానగరం: లాలాచెరువు, దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తోందనే ప్రచారం ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. దీనికి తోడు అదిగో పులి అంటే ఇదిగో తోక అనే వారు చేసే పుకార్లతో లాలాచెరువు నుంచి రాజానగరం వరకు జనం బిక్కిబిక్కుమంటూ గడుపుతున్నారు. లాలాచెరువులోని గోదావరి మహాపుష్కర వనం సమీపంలో గురువారం రాత్రి చిరుతపులి ఒక జంతువును నోట కరుచుకుని అటవీ సిబ్బంది క్వార్టర్ల వైపు వెళ్లిందనే ఓ ప్రయాణికుని సమాచారం అటు అటవీ శాఖలోను, ఇటు ప్రజల్లోనూ అలజడి రేపింది. అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు వాస్తవాలను తెలుసుకునే పనిలో పడ్డారు. శుక్రవారం రాత్రి అదే ప్రాంతంలో ఉన్న ఆకాశవాణి కేంద్రం సమీపంలో ఉన్న సీసీ కెమెరాలో ఒక పందిని వెంబడిస్తూ చిరుత వెళ్లడం రికార్డవడంతో దాని సంచారం రూఢీ అయ్యింది. దీంతో పరిసరాలలోని ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు పులిని త్వరగా పట్టుకునేలా జిల్లా అటవీ అధికారి భరణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

జాతీయ రహదారిపై బిక్కుబిక్కుమంటూ..

చీకటి పడితేచాలు ఏ ఒక్కరూ ఒంటిరిగా బయటకు రావొద్దంటూ అటవీ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో లాలాచెరువు నుంచి దివాన్‌చెరువు వరకు ఉన్న జాతీయ రహదారిపై ప్రయాణించే వారు భీతిల్లుతున్నారు. లాలాచెరువు, దివాన్‌చెరువు ప్రాంతాల్లో జాతీయ రహదారిని ఆనుకుని 534.18 హెక్టార్లలో రిజర్వు ఫారెస్టు ఉండటంతో ఆ పరిసరాలలో నివసిస్తున్నవారు కూడా ఏ సమయాన ఏం జరుగుతుందోనని భీతిల్లుతున్నారు.

భయపెడుతున్న పుకార్లు

లాలాచెరువు, దివాన్‌చెరువు ప్రాంతాల్లో చిరుత సంచారం నేపథ్యంలో సోషల్ మీడియాలో పుకార్లు చురుగ్గా వ్యాపిస్తున్నాయి. గాయాలతో ఉన్న యువకుడి ఫొటో వేసి చిరుత దాడిలో గాయపడినట్టుగా కథ అల్లేశారు. అలాగే రాజానగరం శివారు సూర్యారావుపేటలో శనివారం రాత్రి చిరుత ఒక మేకను నోట కరుచుకుపోయిందంటూ ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో వాస్తవాన్ని నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉంది.

ఎలా వచ్చింది!

సాధారణంగా జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలకు అడవి జంతువులు వచ్చేందుకు అవకాశం ఉండదు. కానీ ఈ చిరుతపులి జన సాంద్రత అధికంగా ఉండే లాలాచెరువు, దివాన్‌చెరువు ప్రాంతాలకు ఎలావచ్చిందనేది చర్చనీయాంశమైంది. రిజర్వు ఫారెస్టు ఉండటం వల్ల వచ్చి ఉండవచ్చని, అది కూడా అడ్డతీగల ప్రాంతం నుంచి మల్లిసాల మీదుగా ఇవి రావడానికి అవకాశాలున్నాయనే వాదన కూడా వినిపిస్తుంది. అంతేకాక గతంలో 2008, 2011, 2018లలో మూడు పర్యాయాలు రాజమండ్రిలో చిరుతపులులు సంచరించి, జనాన్ని హడలెత్తించాయంటున్నారు.

నగర వనం తాత్కాలికంగా మూసివేత

చిరుతపులి పట్టుకునే వరకు గోదావరి మహాపుష్కర నగర వనాన్ని 16వ తేదీ వరకు తాత్కాలికంగా మూసివేస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా అటవీశాఖ అధికారి భరణి ఆదివారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. చిరుత సంచారంపై పరిసర గ్రామాలలోని ప్రజలను చైతన్యపరుస్తూ కరపత్రాలను విస్తృతంగా పంచామన్నారు. అలాగే చిరుత జాడ తెలుసుకుని త్వరగా పట్టుకునేలా అది సంచరించేందుకు అవకాశం ఉందనే ప్రాంతాలలో 50 ట్రాప్ కెమెరాలను అమర్చి, నాలుగు ట్రాప్ బోన్లను అమర్చామన్నారు. ఆకాశవాణి కేంద్రం, ఆటోనగర్ ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టుగా తెలిసిందన్నారు. ఇంతవరకు అది ఎవరిపైనా దాడి చేయలేదన్నారు. రిజర్వు ఫారెస్టు పరిసరాలలో ఉంటున్న ఇళ్ల చుట్టూ చీకటి వలయాలను ఉంచకుండా వెలుగులు ఉండేలా లైట్లు వేసి ఉంచాలన్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

ఆత్రేయపురం: మండలంలోని వద్దిపర్రు గ్రామానికి చెందిన మానేపల్లి వెంకటలక్ష్మి (43) శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. వద్దిపర్రు గ్రామానికి చెందిన మానేపల్లి గోవింద్‌తో వెంకటలక్ష్మికి ఇరవై ఏళ్ల కిందట వివాహమైంది. గోవింద్ రోజూ మద్యం తాగి హింసించడంతో వెంకటలక్ష్మి శనివారం సాయంత్రం పురుగు మందు తాగింది. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందిందని, ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు రామ్మోహన్‌నాయుడు, దుర్గేష్, రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ పురందేశ్వరి


ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో 78వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వీటిని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర క్రీడలు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. తూర్పుగోదావరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నిర్వాహకులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం లక్ష్మీవారపుపేటలో ఫ్యాన్సీ సామాన్లతో తయారు చేసిన వినాయకుడు



నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్‌లో శ్రీపూజ గణపతి, కుమారస్వామి ఆలయం వద్ద 16 అడుగుల విగ్రహం



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో ఆకట్టుకున్న వినాయక విగ్రహం



కాకినాడ దిగుమర్తి వారి వీధిలో ధాన్యంతో తయారు చేసిన వినాయకుని ప్రతిమ



జగన్నాథపురం నేతాజీ పార్కు వద్ద 15 అడుగుల పంచదార వినాయక విగ్రహం

వక్రతుండాయ.. బహురూపాయ

- వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు
- ఉమ్మడి జిల్లాలో అంబరాన్నంటిన వేడుకలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం సిటీ) /అమలాపురం టౌన్/ పిఠాపురం: వక్రతుండ మహాకాయ.. కోటి సూర్య సమప్రభ.. నిర్విఘ్నం కురుమేదేవ.. సర్వకార్యేషు సర్వదా.. అంటూ బొజ్జ గణపయ్యను అంతా కొలిచారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వినాయక ఉత్సవ మంటపాలను వీధివీధినా ఏర్పాటు చేసి భక్తిని చాటారు. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద వినాయక మండపంలో ప్రతి ఏడాది ఒక ప్రత్యేక అవతారంలో స్వామి దర్శనమిస్తారు. ఈసారి పసుపు, కుంకుమలతో రూపొందించిన సృష్టి గణపతికి ఉత్సవ కమిటీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో పూజలు చేశారు. అక్కడ గణనాథుల బొమ్మల కొలువు అందర్నీ ఆకట్టుకుంది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాజా మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి ఇక్కడ ఎంతో అట్టహాసంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే రాజమహేంద్రవరంలోని పలుచోట్ల భారీ విగ్రహాలను నెలకొల్పారు. చాగల్లులో తెలగా సంఘం, చాగల్లు, నెలటూరు వర్తక సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా నవరాత్ర ఉత్సవాలు నిర్వహించారు. ఆ రెండు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సుమారు రూ.50 లక్షలకు పైగా ఖర్చు చేసి ఉత్సవాలకు నిండుతనం తీసుకురావడానికి కృషి చేస్తున్నారు.



గోకవరంలో 18 వేల రుద్రాక్షలతో తీర్చిదిద్దిన గణనాథుడికి పూజలు

కోనసీమలో..

కోనసీమ జిల్లాలోని అమలాపురం పట్టణం వినాయక చలువ పందిళ్లకు పెట్టింది పేరు. షరాబుల పందిరి, గడియారం స్తంభం సెంటరులోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద, కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటైన చలువ పందిళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అయినవిల్లి వినాయక స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం ఆకట్టుకుంది. అంబాజీపేట మండలం గంగలకుర్తి మలుపు వద్ద ఉన్న విజయ గణపతి ఆలయాన్ని 108 అరటి గెలలతో అలంకరించారు. రామచంద్రపురం పట్టణంలో బాలభక్త సంఘం 65వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో తాళ్లరేవు, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో వినాయక పందిళ్లు భారీగా వెలిశాయి. మండపేట, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లో కూడా వినాయక చవితి ఉత్సవాలు జరిగాయి. జిల్లాలో దాదాపు 1,800 వినాయక చవితి పందిళ్లకు జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి అనుమతులు జారీ అయ్యాయి. కొత్తపేటతో పాటు ఆ మండలంలోని వాడపాలెం, అవిడి గ్రామాల్లో పౌరాణిక నాటకాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



రాజమహేంద్రవరంలో సృష్టి వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు

కాకినాడ జిల్లాలో..

పిఠాపురం జై గణేష్ ఆలయంతో పాటు కాకినాడ సాలిపేట, తుని, జగ్గంపేట, పెద్దాపురం, సామర్లకోట, కాకినాడ రూరల్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక మండపాలను శనివారం ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను నిలిపారు. ఆదివారం అన్ని అలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకినాడ దిగుమర్తివారి వీధిలో ధాన్యంతో 18 అడుగుల పొడవైన విగ్రహాన్ని నిలిపారు. జగన్నాథపురం నేతాజీ పార్కు వద్ద 1200 కిలోల పంచదారతో తయారు చేసిన వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గొల్లప్రోలులో 5 వేల రుద్రాక్షలు, గోకవరంలో 18 వేల పంచముఖ రుద్రాక్షలతో ప్రత్యేకంగా తయారు చేసిన వినాయక విగ్రహాలు ఆకట్టుకున్నాయి. గోకవరం గుబ్బాలమ్మ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో రూ.1.40 లక్షలతో హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెచ్చిన 15 అడుగుల విగ్రహం ఆకర్షించింది.

ఏసీఏ కార్యదర్శిగా సతీష్‌బాబు



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రా క్రికెట్ సంఘ (ఏసీఏ) కార్యదర్శిగా సామాజిక సేవా సభ్యుడు, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సానా సతీష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఫౌండేషన్ ప్రతినిధి టి.హరిష్ ఆదివారం తెలిపారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఏసీఏ ప్రతినిధులు ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారన్నారు. ఈ సందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ క్రీడలపై తనకున్న మక్కువతో ఈ అత్యున్నత హోదాను అందిపుచ్చుకున్నానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి నైపుణ్యం ఉన్న క్రికెట్ క్రీడాకారులను వెలికి తీసి ప్రోత్సహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన నగరాలైన మంగళగిరి, కడప ప్రాంతాల్లో కూడా అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు నాంది పలుకుతామని అన్నారు. సతీష్‌బాబును జిల్లా మాజీ క్రికెట్ సంఘ కార్యవర్గ సభ్యులు బాపిరాజు, సత్యనారాయణ, హరీష్, కిరణ్‌రాజు, కొండలరావు, జిల్లా బాలుర, బాలికల క్రికెట్ సంఘ కార్యదర్శి పి.సత్యనారాయణ తదితరులు అభినందించారు.

వైద్యులపై దాడి అమానుషం



గోపాలపురంలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఐఎంఏ సభ్యులు, వైద్యులు



రావులపాలెం ప్రగతి నర్సింగ్ హోమ్‌పై దాడి చేసిన ఆరుగురు నిందితులతో పోలీసులు

- రావులపాలెంలో వైద్యులు, సిబ్బంది నిరసన
- చట్టరీత్యా చర్యలకు ప్రజాప్రతినిధుల భరోసా

కొత్తపేట: రావులపాలెంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిపై దాడి చేసి వస్తువులు ధ్వంసం చేయడాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు, వివిధ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. కోల్‌కతాలో వైద్యురాలి హత్యోదంతం, వైద్యలోకం ఆందోళన మరువక ముందే శుక్రవారం రావులపాలెంలో ప్రగతి నర్సింగ్ హోమ్‌లో వైద్యులు, సిబ్బందిపై దాడి ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తూ, బాధితులకు అండగా నిలుస్తామని, నిందితులు ఎవరైనా సరే చట్టరీత్యా చర్యలకు సహకరిస్తామని భరోసా ఇచ్చారు. కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో జరిగిన ఈ దాడిని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఖండించారు. ఆ మేరకు వైద్యులకు భరోసా కల్పిస్తూ మంత్రి సందేశాన్ని పంపినట్టు ఐఎంఏ సభ్యులు తెలిపారు. నిందితులు ఎవరైనా చర్యలు తప్పవని పేర్కొన్నారని అన్నారు.

- బాధిత ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి మద్దతుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కొత్తపేట శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కాశినగేయానంద శేషుబాబు, డాక్టర్ కె.వీర్రెడ్డి, సభ్యులు డాక్టర్లు ఎం.గంగిరెడ్డి, మెంటే ఉదయ భాస్కరరావు, ఎంఆర్ఎల్ భీమారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కొత్తపేట, రావులపాలెం వైద్యులు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులకు శనివారం వినతిపత్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా గోపాలపురంలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని కలసి వినతిపత్రం ఇచ్చారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని వైద్యులు కోరారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రునికి వైద్యం అందిస్తున్న సమయంలో వైద్యులు, సిబ్బందిపై దాడి చేయడం అమానుష చర్య అని అన్నారు. ఆపద కాలంలో ప్రాణాలు కాపాడే వైద్యులపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నానని అన్నారు. దోషులను శిక్షించే వరకూ వైఎస్సార్ సీపీ తరఫున డాక్టర్లకు తమ సహాయ సహకారాలు ఉంటాయని జగ్గిరెడ్డి భరోసా ఇచ్చారు.
- రావులపాలెంలో ప్రైవేట్ వైద్యులు, సిబ్బందిపై దాడి చేయడం అమానుషమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు వాడపాలెంలోని ఎమ్మెల్యే సత్యానందరావును కలసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దీనిపై పోలీసు అధికారులతో మాట్లాడానని, నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వైద్యులపై దాడిని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ఖండించారు.

ఆరుగురి అరెస్ట్

ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, క్షతగాత్రుడిపై దాడి చేసిన కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు రావులపాలెం టౌన్ సీఐ జేమ్స్ రత్నప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల 6న సాయంత్రం రెండు మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న సమయంలో స్థానిక ప్రగతి నర్సింగ్ హోమ్‌పై, బాధితుడిపై, వైద్యులుపై దాడి చేసిన ఘటనలో ఆసుపత్రి వర్గాలు, బాధితుడు బుడ్డిగ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుపై ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా దాడికి పాల్పడిన పి.గన్నవరం మండలం గంటి పెదపూడికి చెందిన చిటికెన బాలబాలాజీ, కుప్పాల సూర్యనారాయణ, కుప్పాల జయబాబు, దంగేటి వెంకట రామాదుర్గారావు, దిరిసిల చరణ్‌తేజ్, యర్రంశెట్టి సాయి హేమంత్ రాజ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి శనివారం కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారికి రిమాండ్ విధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇలాంటి దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెనుగుదురులో వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన లక్ష్మణరావు

కరప (కాకినాడ రూరల్): మద్యం మత్తులో వాగ్వాదం ఓ వ్యక్తి ప్రాణాలను తీసింది. కరప మండలం పెనుగుదురు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం తుమ్మలపల్లి లక్ష్మణరావు (50) దారుణ హత్యకు గురయ్యారు. కరప పోలీసుల కథనం ప్రకారం.. పెనుగుదురు గ్రామ శివారు రైస్‌మిల్లు ఎదురుగా లక్ష్మణరావుతో పాటు అదే గ్రామానికి మరికొంత మంది మద్యం తాగుతుండగా, ఇందులో రాంబాబుతో వాగ్వాదం చోటుకుంది. రాంబాబు, లక్ష్మణరావుల మధ్య గొడవ తీవ్ర ఆవేశానికి దారితీసింది. ఈ నేపథ్యంలో లక్ష్మణరావు పీకపై కత్తితో రాంబాబు కోశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో లక్ష్మణరావును కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతుడు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య, ఇద్దరు అమ్మాయిలు ఉండగా అమ్మాయిలకు పెళ్లిళ్లు చేశాడు. నిందితుడు గతంలోనే ఒక వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడడం, ఆ కేసులో కండీషన్ బెయిల్‌పై తిరుగుతున్నట్టు తెలిసింది. సంఘటన స్థలాన్ని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు, రూరల్ సీఐ చైతన్యకృష్ణ పరిశీలించారు. ఎస్సై ఆర్‌వీఎస్ మూర్తి కేసు నమోదు చేశారు. హత్యకు మద్యం మత్తులోనే వాగ్వాదం దారితీసిందా మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన లక్ష్మి

రావులపాలెం: స్థానిక బస్టాండ్ ఇన్‌గేట్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక మహిళ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం తిరుపతిపురానికి చెందిన కంబాల లక్ష్మి (58) తన కుమార్తె ఇల్లు ఆత్రేయపురం మండలం వాడపల్లికి వచ్చింది. తిరిగి కొడుకు ఇంటికి వెళ్లేందుకు రావులపాలెం బస్టాండ్‌కు బయలు దేరింది. వాడపల్లి నుంచి ఆమె అల్లుడు మోటార్ సైకిల్‌పై తీసుకువచ్చి బస్టాండ్ వద్ద దించి వెళ్లాడు. అయితే అత్తిలి బస్సు ఎక్కేందుకు బస్టాండ్ లోపలకు వెళుతున్న లక్ష్మిని కాకినాడ డిపోకు చెందిన రాయచూర్- కాకినాడ సూపర్ లగ్జరీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తూ నడిచి వెళుతున్న లక్ష్మిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా ప్రాంతాన్ని రావులపాలెం ఎస్సై చంటి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కొత్తపేట: విద్యుత్ షాక్‌తో ఓ మృతి చెందినట్లు ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజోలు మండలం శివకోడుపాలేనికి చెందిన శిరం మారుతీ సుబ్బారావు వివిధ ఉత్సవ పందిర్లలో 14 ఎంఎం వీధి సినిమాలు ప్రదర్శిస్తుండేవాడు. ఇందులో భాగంగా వినాయక చవితి పర్వదినం సందర్భంగా కొత్తపేట మండలం మోడేకుర్రు బాల గణపతి నవరాత్ర ఉత్సవ పందిరిలో శనివారం రాత్రి సినిమా ప్రదర్శనకు సంబంధించి తెర కడుతుండగా సీరియల్ సెట్స్‌కు విద్యుత్ సరఫరా నిమిత్తం తగిలించిన పిన్నీసు తగలడంతో మారుతీ సుబ్బారావు (45) విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యంలో మృతి చెందాడు. దీనిపై స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై సురేంద్ర మృతదేహాన్ని పరిశీలించారు. ఆదివారం మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్కల స్వైర విహారం

- 13 మందిపై దాడి
- ఒక గొర్రె మృతి



ముగ్గళ్లలో కుక్క కాటుకు గురైన మానస



చనిపోయిన గొర్రె

సీతానగరం: పిచ్చి కుక్కలు జనాన్ని బెంబేలెత్తించాయి. దొరికిన వారిపై దాడి చేశాయి. ఆ వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ముగ్గళ్ల, ఇనుగంటివారిపేటలకు చెందిన ఎస్సీ పేటల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రెండు పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తూ దొరికివారిపై దాడి చేశాయి. చిన్న పిల్లలతో పాటు వృద్ధుల వరకూ 13 మందిని కరిచాయి. జక్కల అంజనా కుమార్‌కు చెందిన రూ.10 వేల విలువైన గొర్రెను చంపేశాయి. ఐదేళ్ల మానిపాటి మానసను తీవ్రంగా గాయపరిచాయి. ఆరేళ్ల పాపను కరవడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. ఈరెల్లి వెంకటేశ్వరరావు (70), ఇప్పర్తి కిట్టయ్య, నొక్కి రూప తదితరులు కుక్కకాటుకు గురై సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చికిత్స పొందారు. అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం 5 గంటలకు ఆ రెండు పిచ్చికుక్కలను స్థానిక యువకులు హతమార్చారు.

అంతిమ యాత్రకు పీకల్లోతు కష్టాలు



వరద ఉధృతిలో శవ పేటికను నదీపాయ దాటిస్తున్న బంధువులు

పి.గన్నవరం: వరదల సమయాల్లో ఎవరైనా మరణిస్తే వారి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు లంక గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. పి.గన్నవరం గ్రామ శివారు కత్తులవారిపేటకు చెందిన మట్టా లక్ష్మి (68) అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని ఖననం చేసేందుకు నదీపాయ అవతల ఉన్న జిల్లేడులంకకు తరలించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో తాటికాయలవారిపాలెం ఏటిగట్టు నుంచి పీకల్లోతు వరద నీటిలో శవపేటికను నదీపాయ దాటించి జిల్లేడులంకలో అంత్యక్రియలు నిర్వహించారు. వరద ఉధృతిలో ఇలా శవపేటికను తరలించడం ప్రమాదకరమని, అయినా తప్పదని గ్రామస్తులు తెలిపారు. ఏటా వరదల సమయాల్లో మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇలాగే కష్టాలు పడుతున్నామని కత్తులవారిపేట వాసులు వాపోయారు.